క్లుప్తంగా

కమాన్ ప్రారంభం



కమాన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బండి సంజయ్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని పోచెట్టిపల్లిలో వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ నిర్మించిన కమాన్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శనివారం ప్రారంభించారు. గ్రామంలో మల్లిఖార్జునస్వామి పురాతన ఆలయం ఉండడంతో దాదాపు రూ.12 లక్షలతో నిర్మించారు. కమాన్‌ను బండి సంజయ్ ప్రారంభించారు. ఎర్రం మహేశ్ గోపు బాలరాజు, రవికిశోర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు లబ్ధి



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సీఎం సహాయనిధితో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని ఈ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నిమ్మలక్ష్మి, ఎంపీటీసీ అబేరా సుల్తానా అన్నారు నారాయణపూర్‌లో శనివారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. నాయకులు నారాయణరెడ్డి, మజీద్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంజార బాధితులకు పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బాకురుపల్లి తండాకు చెందిన బంజార సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర రాజు నాయక్ కుటుంబీకులను జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు శనివారం పరామర్శించారు. రాజునాయక్ కుటుంబానికి చెందిన లకావత్ తిరుపతి అనే వ్యక్తి ఇంజెక్షన్ వికటించి ఇటీవల మృతిచెందగా.. వారిని పరామర్శించి మంత్రి కేటీఆర్ సహకారంతో ఆదుకుంటామని హమీ ఇచ్చారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ మంజుల ఉన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్: మండలంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి వెళ్లే దారిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణుల సంఘం మండలఅధ్యక్షుడు సద్గుణాచారి కోరారు. పోతుగల్ మెయిన్‌రోడ్డు నుంచి మానేరు కాలువ మీదుగా ఉన్న ఆలయ రహదారి రాత్రివేళల్లో చీకట్లతో ఉంటుందన్నారు. దీంతో ఈ దారి వెంట ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. పైగా పక్కనే కాలువ ఉండడంతో చీకట్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఆర్‌ఎస్. ప్రవీణ్ పర్యటన విజయవంతం చేయాలి

కోనరావుపేట: బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లికి వస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పర్యటనను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు కుమ్మరి దేవదాస్ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా ఈనెల 19 ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లికి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌టీపీ జిల్లా యూత్ అధ్యక్షుడిగా రాజారమేశ్



నియామక పత్రం అందుకుంటున్న రాజారమేశ్

సిరిసిల్లటౌన్/గంభీరావుపేట: వైఎస్సార్‌టీపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామానికి చెందిన మారబోయిన రాజారమేశ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం చీఫ్ కోఆర్డినేటర్ గడ్డం హిందుజారెడ్డి నియామకపు పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలమ్మకు, గట్టు రాంచంద్రం రెడ్డి, చొక్కాల రాముకు కృతజ్ఞతలు తెలిపారు.



అభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ దంపతులు



బస్వాపూర్‌లో మహా శివుడి షావతో గ్రామస్తులు



ముస్తాబాద్‌లో అభిషేకం చేస్తున్న భక్తులు



కోనరావుపేటలో శివకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శంభో శంకర..

- శ్రద్ధాసక్తులతో మహాశివరాత్రి పర్వదినం
- ఘనంగా శివపార్వతుల కల్యాణం
- ఆలయాల్లో దర్శనానికి పోటెత్తిన భక్తులు
- జాగరణ, ఉపవాసాలు

సాక్షినెట్‌వర్క్: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. శనివారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా గరళ కంఠుడికి తెల్లవారు జాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివ రాత్రి జాగరణలు, స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. బస్వాపూర్‌లో మహాశివుడి షావను ఊరేగించారు. భక్తులు ఉపవాస దీక్షలతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. పోలీస్‌శాఖ భారీ బందోబస్తు నిర్వహించారు.



గంభీరావుపేటలో సహస్ర దీపాలంకరణ, 108 విగ్రహాల దర్శనం



సిరిసిల్ల శివాలయాల్లో భక్తుల పూజలు



కుందలో నైవేద్యం వండుతున్న మహిళలు



బండలింగంపల్లిలో తోట ఆగయ్య మొక్కులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్తులు



శివయ్యకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు



నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఎల్లారెడ్డిపేట శివాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

ఉత్సవాలు ఓవైపు..
ఏర్పాట్లు మరోవైపు



శనివారం నాటికి ఇంకా జరుగుతున్న నందికమాన్ వద్ద నిర్మాణ పనులు

- నత్తనడకన సాగిన పనులు
- పనుల్లో నాణ్యత లోపించిందని భక్తుల్లో అసంతృప్తి
- ఇంకా కొనసాగుతున్న పనులు
- పట్టించుకోని అధికారులు

సిరిసిల్లక్రైం: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రాజన్న దర్శనానికి ఆలయాలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమైనప్పటికీ శనివారం ఉదయం వరకు రాజన్న ఆలయం కట్టమీద లైటింగ్ ఏర్పాటుచేయకపోవడం గమనార్హం. రాత్రిళ్లు లైటింగ్ పనులుచేయాలని ఆదేశాలివ్వడంతో సంబంధిత కార్మికులు ఎక్కడ ఎలాంటి కరెంట్‌షాక్ తగులుతుందోనన్న భయంతో పనులు నెమ్మదిగా చేసినట్లు సెస్ విభాగంలో ఓ కార్మికుడు తన ఆవేదన వ్యక్తంచేశాడు. అంతేకాకుండా రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు ముందుగా నందిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో రాష్ట్రంలో వివిధ జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ముందుగా నందికమాన్ వద్ద నందిని మొక్కుతారు. కానీ శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం నాటికి నందికమాన్ వద్ద నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో భక్తులు విమర్శలు గుప్పించారు. ఆగమేఘాలపై పనులు చేయడంతో నాణ్యత కోరవడిందని, భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా నిర్మాణాలు సగం చేయడం సరికాదని స్థానికులు పేర్కొన్నారు.



శనివారం ఉదయం ఏర్పాటు చేస్తున్న లైట్లు

పోచెట్టిపల్లిలో స్నానాలు..
రాజన్న సన్నిధిలో దర్శనాలు



ధర్మగుండం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

- సంప్రదాయం కొనసాగిస్తున్న నిజామాబాద్ ప్రాంత భక్తులు



పోచెట్టిపల్లిలో ఉన్న ధర్మగుండం

వేములవాడరూరల్: నిజామాబాద్ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు ఇప్పటికీ వారి సంప్రదాయం కొనసాగిస్తున్నారు. వేములవాడరూరల్ మండలంలోని పోచెట్టిపల్లిలో కొన్ని వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ధర్మగుండంలో స్నానాలు చేయడం వారి నమ్మకం. పోచెట్టిపల్లిలో ఆగి స్నానాలు చేసిన తర్వాత రాజన్న సన్నిధికి వచ్చే వారని గ్రామస్తులు తెలిపారు. అదే పద్ధతిని నేటికీ ఆ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు పాటిస్తున్నారు. పోచెట్టిపల్లిలో స్నానాలు చేసి, మొక్కులు చెల్లించుకున్న తర్వాత కాలినడకన వేములవాడకు చేరుకుంటున్నారు. కొన్నేళ్లుగా వారు ఈ సాంప్రదాయన్ని కొనసాగిస్తున్నారు. ఈ ధర్మగుండాన్ని శుద్ధి చేసి, ఆధునికీకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మా తాతల నుంచి ఉంది



మా తాతాల నుంచి ఈ ధర్మగుండం ఉంది. నా చిన్నప్పటి నుంచి దీన్ని చూస్తున్నాను. నిజామాబాద్ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు ఇక్కడ స్నానాలు చేసి, వంటలు చేసుకుంటారు. ఇక్కడి నుంచి రాజన్న సన్నిధికి కాలినడకన వెళ్లి దర్శనం చేసుకుంటారు.

– గోపు బక్కయ్య, పోచెట్టిపల్లి

ఘనంగా మల్లన్న బోనాలు



అల్మాస్‌పూర్‌లో పుట్టబంగారం తీసుకెళ్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లో మల్లికార్జునస్వామి–కేతమ్మ కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి బోనాల ఊరేగింపు నిర్వహించారు. నెత్తిన బోనాలతో మహిళలు తరలివచ్చారు. కేతమ్మ తల్లికి బోనం సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత యాదవులు పుట్ట బంగారం తెచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 11 గంటలకు మైలపోలు, సుంకుపట్టే కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం మాట నిలబెట్టుకోవాలి

ఇల్లంతకుంట: దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినమాట నీటిమూటైందని తెలంగాణ దళిత సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సావనపెల్లి రాకేశ్ శనివారం పేర్కొన్నారు. భూమి లేని దళితులకు మూడెకరాల భూమి, దళితబంధులో రూ.10లక్షల సాయం ఇలా దళితుల్లో ఎన్నో ఆశలు నింపి మోసం చేశారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా దళితులందరికీ మూడెకరాల భూమి, దళిత బంధు పథకాలు అమలు చేయాలన్నారు.

రాజన్న సన్నిధిలో సేవా కార్యక్రమాలు



పండ్లు పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

సిరిసిల్లటౌన్: మహాశివరాత్రి సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వేములవాడ సన్నిధికి పాదయాత్రగా వస్తున్న భక్తులకు సిరిసిల్లకు చెందిన పిల్లల వైద్యుడు సురేంద్రబాబు పండ్లు పంపిణీ చేశారు. సత్యసాయి సేవాసమితి అధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులకు కందగడ్డను అందచేశారు. బియ్యంకార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో కిక్కిరిసిన జనం



వేములవాడఅర్బన్: పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులోని రోడ్డుకు ఇరువైపులా కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటుచేశారు. దీంతో శనివారం మహాశివరాత్రి జాగరణ కావడంతో పట్టణ ప్రజలు, పరిసరాల గ్రామాల ప్రజలు మార్కెట్‌కు తరలివచ్చి కూరగాయాలు, పండ్లు, పూలు, వివిధ రకాల సామగ్రి తీసుకువెళ్లడానికి ప్రజలు బారులు తీరడంతో రోడ్డంత జనాలతో నిండిపోయింది.

ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం





జీవైనగర్ ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, నర్సింగపూర్‌లో నిర్వహిస్తున్న కల్యాణం

సిరిసిల్లటౌన్/చందుర్తి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శనివారం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం ఘనంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణానికి విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అభివృద్ధి ఏదీ?



మాట్లాడుతున్న భీమ్‌ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం ఏర్పాటై 40ఏళ్లు గడుస్తున్నా ఇంకా వెనుకబడి ఉందని భీమ్‌ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్ విమర్శించారు. కోనరావుపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ మండలానికి చెందిన వారే ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్రమంత్రిగా పనిచేసినప్పటికీ మండలంలో అభివృద్ధి అంతంతే జరిగిందన్నారు. మండలంలో డిగ్రీ కళాశాల, బీసీ బాలికల గురుకుల పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని కోరారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జాషువా, ప్రణయ్, రఘు, రాజు, మహేందర్, కల్యాణ్, సురేశ్, గోపి పాల్గొన్నారు.